

క్రైస్తవ మాసపత్రిక
కృపా వాక్యము
www.preachers training school.com
మే
2024
SONY

Editor:

**Dr. K.G. Kumar,** Founder, President & Director, Preachers Training Schools

ఈ సంచికలో . . .


1. యదార్థమైన హృదయము - కె.జి. కుమార్

2. గురి కలిగియుండు - డి. శ్రీధరరావు

3. పావురమువలె జీవించెదము - పి. చంద్రశేఖర్

4. ఓ జీవన నేస్తమా జాగ్రత్త ! - 127 - కె. సంధ్యారాణి

5. సులువుగా చిక్కులు పెట్టు పాపము - కె.జి. కుమార్


## OWNERSHIP INFORMATION:


| | | |
|---|---|---|
| Publisher | : | Dr. K.G. Kumar |
| Printer | : | Mr. G. Venkateswarao |
| Owner | : | Dr. K.G. Kumar |
| Printing Press | : | Near Pindala Tank<br>Jawahar Street<br>Kakinada-533003 |
| Place of Publication | : | Turangi, Kakinada-533 016<br>D.No.7-113, Ravindranagar,<br>Turangi, Kakinada-533 016,<br>E.G.Dist., A.P., |
| Periodicity of Publication<br>& Language | : | Monthly, Telugu & English |
| Nationality | : | Indian |

సింగిల్ కాపీ : 20/- సంవత్సరపు చందా : 200/- జీవితకాలపు చందా : 1500/-

మీచందాను ఈ దిగువ బ్యాంకు అకౌంట్కైనను పంపవచ్చును

**ది సౌత్ ఇండియన్ బ్యాంక్, కాకినాడ**

RTGS Code: SIBL0000126 , అకౌంట్ నెం. 0126053000006977



కృపావాక్యము మాసపత్రిక కావలసినవారు చందా పంపవలసిన చిరునామా

ఎడిటర్, కృపావాక్యము cell: 9849031095, 6309686167

రవీంద్రనగర్, తూరంగి

కాకినాడ-533016, తూ.గో.జిల్లా, ఆం.ప్ర., ఫోన్: 2342125

Email: kedarisetti_2000@yahoo.com

Website: www.preacherstrainingschool.com

# క్రైస్తవాక్యము

CHURCH OF CHRIST

Pleading for the Unity of Brotherhood

క్రీస్తుసంఘము. మత్త. 16:18, ఎఫె. 1:22,23, కొల. 1:18,24, రోమా 16:16

సంపుటి 27 | మే 2024 | సంచిక 5


## యదార్థమైన హృదయము

యదార్థమైన హృదయముతో దేవుని సన్నిధానమునకు చేరుదుము (హెబ్రీ 10:22). 1) ప్రతీ ఆదివారము ఆరాధనకు పోవునప్పుడు మన స్థితి ఎలా వుంటే మన ఆరాధనను ఆ మహోన్నతుడు అంగీకరించగలడు? 2) మనము పరమునకు క్రీస్తుతోపాటు పోవలెనన్నా మన స్థితి ఎలా వుండవలెను? యదార్థముగా ఆరాధించుటకు కొన్ని విషయములు హెబ్రీ గ్రంధకర్త తన 10వ అధ్యాయము 22వ వచనములో విశదపర్చినాడు. "(1) మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములు గలవారమును, (2) నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారమునై యుండి, (3) విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, (4) యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము." ఈ విధానమును క్రైస్తవులు ఎలాగు ఆలోచించుచున్నారు, నిర్మలమైన హృదయముతో దేవునిని ఆరాధించుటకు వెళ్ళగలుగుచున్నారా? అట్లు కానియెడల వారి ఆరాధన వ్యర్థమగును కదా!

అలాగుననే నిర్మలమైన హృదయముతో ఆరాధించలేక పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించలేనప్పుడు పరమునకు ఎట్లు చేరగలరు? యదార్థమైన, నిర్మలమైన మనస్సాక్షితో దేవుని ఆరాధించుటకు మన జీవన విధానములో ఎంత మార్పు ఎంత తగ్గింపు అవసరము, వయస్సుతో సంబంధము లేక బాధ్యతలతో సంబంధము లేక

మన అపరాధములకు మనుష్యులమధ్య క్షమాపణము పొందిన యెడల పరమునందున్న తండ్రి క్షమించును. అట్లుకాక మనము హేయభావముతో, కక్షలతో, అసూయలతో మరణించిన యెడల వాటికి బాధ్యులమగుదము. "ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియల చొప్పున ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది"(ప్రక. 22:12).

మనుష్యులమైన మనము మనలో వున్న ద్వేషములు, క్షమించబడని యెడల పరలోకపు తండ్రి మనలను క్షమించడు. క్రైస్తవులముగా లోకములో మనము మనలోనే మిగిలిపోదుము, ఫలించని అంజూరపు చెట్టువలే నుందుము. దేవుని ఆత్మ మనలో నున్నయెడల మనము ఒకరినొకరము క్షమించుకొందుము. మనము మనుష్యుల పాపములు క్షమించని యెడల పరలోకపు తండ్రి మనలను ఎట్లు క్షమించగలడు?

మన 70, 80 సం॥ల జీవితములో ఎందరినో, ఎన్నో విధములుగా నిందించి చెడ్డమాటలు అసూయచేత పలికినవి ఎంతగానో మనపై నేరము మోపుచుండగా పాపభరితమైన మనజీవన విధానముతోను , పవిత్రత లేని జీవితముతోను తండ్రిని ఎలా ఆరాధించగలము ఆయన వద్దకు ఎలా చేరగలము?

హెబ్రీ గ్రంధకర్త ఒక ముఖ్య విషయమును సూత్రప్రాయముగా తెలుపుచున్నాడు. ఇందు ఒక 5 విషయములతో కూడినదిగా నున్నది దీనిని బోధకులు, పెద్దలు, పాస్టర్సు, క్రీస్తును ఎరుగునను ప్రతీ వ్యక్తి దీనమనస్సుతో ఆలోచించగలరు.

1) కల్మషము లేని మనస్సాక్షి అనగా హృదయములో క్రీస్తు గాక వేరొక వ్యక్తికి చోటివ్వక, పరిపూర్ణతతో క్రీస్తును హృదయమందు ప్రతిష్ఠించుకొన్నవారై, క్రీస్తు స్వారూప్యతకు సమానమై మనోభావము గలవారుగా, నీతిని ప్రకాశింపగలవారుగా నుండుట.

2) క్రీస్తు రక్తముతో ప్రోక్షింపబడిన మనస్సాక్షి "నిత్యుడగు **ఆత్మ**ద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తుయొక్క రక్తము, నిర్జీవక్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధి చేయును" (హెబ్రీ 9:14). యోహానుగారు తన 1వ పత్రికలో 3:9,10లో "దేవుని మూలముగా పుట్టిన ప్రతివానిలో ఆయన బీజము (నీతి) గనుక వాడు పాపము చేయడు; వాడు దేవుని మూలముగా పుట్టినవాడు గనుక పాపము చేయజాలడు.

దీనినిబట్టి దేవుని పిల్లలెవరో అపవాది పిల్లలెవరో తేటపడును. నీతిని జరిగించని ప్రతివాడును, తన సహోదరుని ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులు కారు.'' మనము దేవుని సంబంధులమైనచో ఒకరితో ఒకరము సమాధానము కలిగియుందుము. సమాధానాధిపతియైన ప్రభువు మన హృదయములో ఉండగా విరోధమును ఎట్లు కలిగియుందుము?

3) నిర్మలమైన ఉదకముతో స్నానము చేసినవారు: నయమాను బురదనీళ్ళని ఎంచక దేవుని ప్రవక్త మాటయందు లక్ష్యముంచి యోర్దానులో స్నానమాచరించుటచే శుద్ధీకరించబడెను గదా! అలాగుననే మనమాచరించు నిర్మల ఉదకము శరీర మాలిన్యమును కడుగుటకు కాదు గాని, మన నోటితో పలుకు నిర్మలమైన మనసాక్షినిచ్చు ప్రత్యుత్తరమే (1 పేతు. 3:21) కాబట్టి మరణము ఎప్పుడు సంభవించునో తెలియదు గాన అన్ని వేళలలోను మన మనస్సాక్షిని నిర్మలముగా నుంచుట ముఖ్యము కదా? నిర్మలము అనగా ప్రశాంతముగా ఏ విధమైన తొందర లేనివారై క్రీస్తు అనుగ్రహించు జ్ఞానము మీ హృదయములకు కావలియుండును (ఫిలి.4:7).

4) ఒకే ఒక విశ్వాసము దానియందు పరిపూర్ణత గలవారమై క్రీస్తు దానికి కర్తగాన ఆ విశ్వాసమును నిజమైన భయభక్తులతో వెంబడించవలెను (హెబ్రీ 12:1-2). కొందరి ఆలోచనము ఏమనగా, ఏ సంఘమైన ఒక్కటే, ఏ విశ్వాసమైనా ఒక్కటేనని ఉభయ సన్యాసము, ఉభయ భ్రష్టత్వముగా నుందురు. పూర్ణనిశ్చతలేని విశ్వాసము బూడిదలో పోసిన పన్నీరులాంటిది. దేవుని వాక్యము ఒకే ఒక విశ్వాసమును బోధించుచున్నది.

5) యదార్థమైన హృదయము ఇది మొదటిగా మారుమనస్సుతో ప్రారంభమగును. మన మారుమనస్సు క్రమమైనది కానిచో మన క్రైస్తవ జననము సరియైనది కాదు. జననము సరికాని యెడల ఆత్మ నిన్ను ఎలాగు నడిపించును, కుమారుని ఆత్మ లేనివాడు, తండ్రిని, అబ్బా తండ్రియని ఎట్లు పిలువగలడు (రోమా 8:15) అందువలన మనము మన మారుమనస్సును సరిచేసుకొనుట ముఖ్యము, మారుమనస్సు సరిలేనివారు నశించెదరని దేవుని వాక్యము బోధించుచున్నది (లూకా 13:3). జక్కయ్యలాంటి మారుమనస్సు అనగా మనము బాప్తిస్మమునకు

ముందు చేసిన అక్రమ క్రియలన్నిటిని విడచుట (యెహె. 18:31). మారుమనస్సు సరిలేనిదే దేవుని యదార్థముగా ఆరాధించలేము (అపో.కా. 8:20-24).

హృదయశుద్ధిగలవారు దేవుని చూచెదరు, అందువలన వారి మనస్సాక్షిని వారు శుద్ధి చేసుకొందురు అను విషయమును గ్రహింతుము, మన సహోదరుల యెడల మనము చేసిన అపరాధము క్షమించబడునట్లు మనము అర్పించు ఆరాధనకు ముందుగా క్షమించబడుట అవసరము క్రీస్తు ప్రభు ఇట్లు చెప్పియున్నారు "నేను మీతో చెప్పునదేమనగా- తన సహోదరునిమీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును. కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీమీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము; అటు తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము. నీ ప్రతివాదితో నీవును త్రోవలో ఉండగానే త్వరగా వానితో సమాధానపడుము; లేనియెడల ఒకవేళ నీ ప్రతివాది నిన్ను న్యాయాధిపతికి అప్పగించును, న్యాయాధిపతి నిన్ను బంట్రౌతుకు అప్పగించును, అంతట నీవు చెరసాలలో వేయబడుదువు. కడపటి కాసు చెల్లించువరకు అక్కడనుండి నీవు వెలుపలికి రానేరవని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (మత్త. 5:22-26).

నిజ క్రైస్తవ జీవితములో దేవుని ఆరాధించుటకు యదార్థ హృదయము అవసరము. ప్రతీ క్రైస్తవుడు స్వపరీక్ష చేసుకొనవలెను మన దేవుడు పరిశుద్ధుడు గాన మనమును పరిశుద్ధులుగా బ్రతకాలి (1 పేతు. 1:14).

***

ఓ. శ్రీధరరావు, M.A.,
PT School 9154927278

**ముఖ్యవచనము:-** కీ. 16:8, 1 కొరి. 9:26

**పరిచయము:-** ప్రభువునందు ప్రియులైన కృపావాక్యము పాఠకులందరికి ప్రభువైన యేసుక్రీస్తు నామమున వందనములు.

ప్రతి మానవునికి ఒక గురి, గమ్యము, నిర్దిష్టము అయిన ఉద్దేశ్యము ఉండుట చాలా అవసరము గురి అనేది లేకపోతే మానవుడు ఎందుకు జీవించుచున్నాడు వాని గమ్యము ఏమిటో అనేది అర్ధము కాదు.

ఉదా: విమానం నడిపే పైలెట్, బస్సు నడిపే డ్రైవర్, చదివే విద్యార్థికి ఇవి ఎంతో ముఖ్యం.

బైబిలునందు ఉన్న కొన్ని విషయములను గ్రహించుదాము.

**1) దావీదు "గురి" ఏమిటి?:-** (1 సమూ. 17:1-10,40,49) వచనములు గమనించినట్లయితే గాతువాడైన గొల్యాతు అను శూరుడొకడు ఇతడు విషయములో ఇశ్రాయేలీలు బహుభయపడుచుండిరి. అయితే దావీదు అతనిని చంపుటకు ముందుకు రాగా అతడు యేటి లోయలో నుండి అయిదు నున్నని రాళ్లు తీసి వడిసె నుపయోగించి కేవలము ఒక్క రాయితోనే ఫిలిష్తీయుని నుదుట కొట్టెను. ఆ రాయి వాని నుదురు చొచ్చినందున వాడు నేలను బోర్లపడెను. ఖడ్గము లేకుండానే, యుద్ధ సామగ్రి లేకుండానే కేవలము గురి చూసి కొట్టడం ద్వారా గొల్యాతును చంపెను. అందువలన ఇశ్రాయేలీలు ఎంతో సంతోషించిరి. దావీదు అవిధముగా ప్రజలను రాజగు గొల్యాతు నుండి కాపాడెను.

**2) యేసుక్రీస్తు "గురి" ఏమిటి:-** (లూకా 19:10) నశించిన దానిని వెదకి రక్షించుటయే, మానవునికి దేవునితో ఉన్న స్నేహము ఆదాము ద్వారా చెడిపోయినందువలన యేసుక్రీస్తు మనలను పాపముల నుండి విమోచించి దేవుని యొద్దకు నడిపించుటకు క్రీస్తు ఇహలోకమునకు వచ్చెను (1 తిమో. 1:15, 4:10). అనేకులు క్రీస్తుకు విరోధముగా పనిచేసారు. అయినను క్రీస్తు తన గురి తప్పలేదు. "తండ్రి చిత్తము నెరవేర్చుటయే క్రీస్తు గురియై యున్నది" (యోహా. 6:39,41).

**3) పౌలు "గురి" ఏమిటి:-** (ఫిలి. 3:14)

ఎ) గురి లేకుండా పరుగెత్తువాడు కాడు (1 కొరి. 9:26)

బి) గురియొద్దకే పరుగెత్తుచున్నాడు (ఫిలి. 3:14)

సి) వెనుకున్నవి మరచి ముందున్నవాటి కొరకై (ఫిలి. 3:17)

డి) క్రీస్తుయేసునందు కలుగు బహుమానము కొరకు

పౌలు మంచి గురి కలిగి క్రీస్తు పనిని ఎంతో కష్టపడి పనిచేసిన వ్యక్తి. యేసుక్రీస్తు ముద్రలు తన శరీరమునందు ధరించిన వ్యక్తి (గల. 6:17). క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటిని తన శరీరమునందు సంపూర్తి చేసిన వ్యక్తి (కొల. 1:24). గురి కలిగియున్నాడు కనుక యేసుక్రీస్తు పనిని ఎంతో ప్రయాసతో పనిచేసెను. కనుక అట్టి ప్రయాస మనకు అవసరమై యున్నది.

**4) సాతాను "గురి" ఏమై యున్నది?:-** (ప్రక. 2:10, 1 పేతు. 5:8) నిబ్బరమైన బుద్ధి కలిగియుండుడి ఎందుకనగా మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు సత్యమును వినకుండా, అర్ధము చేసుకోకుండా, క్రీస్తుప్రభువు స్థాపించిన సంఘములోనికి రాకుండా, వాడు ఎంతోమంది నామకార్ధ విశ్వాసులైనవారిని గురిపెట్టి నరకమునకు నడిపించుచున్నాడు (ప్రక. 2:10). కావున వాని వశమున పడకుండా మనము ప్రజలను వాక్యము ద్వారా రక్షించుదాము, సత్యమును ప్రకటించుదుము, నరకం నుండి సాతాను నుండి కాపాడుదుము (యూదా 1:23).

**5) క్రైస్తవునిగా నీ "గురి" ఏమిటి?:-** నిత్యజీవమును స్వతంత్రించుకొనుట (కొల. 3:1-3) యేసుక్రీస్తు మనందరికి అభయము ఇచ్చాడు (యోహా. 14:1,2) స్థలములను సిద్ధపరచ వెళ్ళుచున్నాను అని చెప్పెను. మనముందు విశ్వాసవీరులు ఎంతోమంది మంచి గురి కలిగి తమ జీవితములను ముగించిరి (హెబ్రీ 11వ అధ్యాయము). ఉన్నవారు అందరు కావున హెబ్రీ 12:1-2 అధ్యాయములో విశ్వాసమునకు కర్తవైపు చూచుటయే మన గురియై యున్నది.

పి.టి.స్కూల్‌ని గూర్చి ఆలోచించినపుడు ఎన్నో సంవత్సరములనుండి ఎంతో నమ్మకముగా ప్రయాసతో సహోదర్లు డైరెక్టర్ కె.జి.గారి ఆధ్వర్యంలో నడుపబడుచు అనేకమంది సువార్తికులను తయారుచేయుచు, అనేక స్థలములలో సంఘములను

నెలకొల్పుచు, భారతదేశములో మాత్రమే కాకుండా ఇతర దేశములలో ఎంతో పని చేయుచున్నది. స్కూల్‌యొక్క గురి "సత్యమును ప్రకటించి అనేకులను క్రీస్తునొద్దకు నడిపించుట. ఒక మంచి సహోదరుడిగా నీవు ఒక్క వ్యక్తిని స్కూల్‌కి పంపితే అతడు మంచి బోధకుడిగా తయారుకాగలడు. అప్పుడు నీవు దేవుని పనిపట్ల గురి కలిగియున్నవాడవు అగుదువు. కావున సరియైన "గురిని కలిగియుండు" అప్పుడు తప్పకుండా నిత్యజీవమును సంపాదించుకొందువు దేవుడు మనందరికి సరియైన గురి కలిగియుండునట్లు సహాయము చేయును గాక! అందరికి వందనములు.

## పావురమువలె జీవించెదము

పి. చంద్రశేఖర్, M.A., B.D.
PT School 9666526240

కృపావాక్యము పాఠకులకు, చదువరులకు నా హృదయపూర్వక వందనములు. మనము పావురమువలె ఎందుకు జీవించవలెనో క్లుప్తంగా నేర్చుకొందాము. యేసుక్రీస్తు తన పండ్రెండుమంది అపొస్తలులకు "ఇదిగో తోడేళ్ల మధ్యకు గొఱ్ఱెలను పంపినట్టు నేను మిమ్మును పంపుచున్నాను కనుక పాములవలె వివేకులను పావురమువలె నిష్కపటులునై యుండుడి అని చెప్పెను" (మత్త. 10:16). నేడు ప్రభువు పిల్లలమైన మనము నిష్కపటమైన ఆలోచనలు, కపటపు మాటలు, కపటపు క్రియలు చేయకూడదు. దేవునికి ఇటువంటి క్రియలు బహుఅసహ్యమైనవి.

"ప్రభువు దయాళుడని మీరు రుచిచూచియున్న యెడల సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి" (1 పేతు. 2:1-3). నేడు అనేకుల హృదయము కపటముతో నిండియున్నది.

పావురము పవిత్ర పక్షులన్నిటిలోను చేర్చబడియున్నది. పితరుల యుగములో నోవహు ఓడలో నుండి కాకిని బయటకు పోవిడిచెను. అది బయటకు వెళ్ళి భూమిమీద నుండి నీళ్లు ఇంకిపోవువరకు ఇటు అటు తిరుగుచుండెను (ఆది. 8:6-7). ఈ కాకి వేషధారులైన క్రైస్తవులకు, విశ్వాసములో బలహీనముగా ఉండు క్రైస్తవులకు సాదృశ్యముగా ఉన్నది.

దేవుడు జంతువులద్వారా పక్షులద్వారా మనకు మంచి పాఠములు నేర్పించుచున్నాడు. ఎందుకంటె మనము పిచ్చుకలకంటే, పావురములకంటె బహుశ్రేష్ఠులము. మన ఆత్మ మిక్కిలి విలువైనది కనుక మనకు వాటి ద్వారా మంచి విషయములను బోధించుచున్నాడు.

> అయినను మృగములను విచారించుము అవి నీకు బోధించును, ఆకాశపక్షులను విచారించుము అవి నీకు తెలియజేయును, భూమిని గూర్చి ధ్యానించిన యెడల అది నీకు బోధించును సముద్రములోని చేపలును నీకు దానిని వివరించును (యోబు 12:7-8).

## పావురమునకు గల ప్రత్యేక లక్షణములు

1. **పావురము అపవిత్రమైనవాటిమీద వ్రాలదు:-** బైబిల్ గ్రంథములో పావురమును బలులలో ఉపయోగించుటకు దేవుడు సమ్మతించెను (ఆది. 8:20, లూకా 2:22-24). పావురము దేవుడు అంగీకరించునది (లేవీ. 5:7). పావురము పరిశుద్ధాత్మకు గుర్తుగా యున్నది. "యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్లలో నుండి ఒడ్డునకు వచ్చెను; ఇదిగో ఆకాశము తెరవబడెను, దేవుని ఆత్మ పావురమువలె దిగి తనమీదికి వచ్చుట చూచెను" (మత్త. 3:16). కాకి, గ్రద్ద, రాబందులవంటి పక్షులవలె మృతకళేబరముల మీద, చెత్త చెదారములమీద వ్రాలదు. కొంతమంది క్రైస్తవులు వారి పేర్లు మార్చుకొనుచున్నారు కాని స్వభావము మార్చుకొనుట లేదు. అపవిత్రమైన శరీర కార్యములను చేయుచు వాటితో రాజీపడుచున్నారు.

నోవహు ఓడలో నుండి నల్లపావురమును వెలుపలికి పోవిడిచెను. నీళ్లు భూమి అంతటిమీద నున్నందున తన అరకాలు నిలుపుటకు దానికి స్థలము దొరకలేదు గనుక ఓడలోనున్న నోవహుయొద్దకు తిరిగి వచ్చెను (ఆది. 8:8-11). అది నోవహును మరియు ఓడను మరచిపోలేదు. ఆ ఓడ (క్రీస్తు సంఘమునకు) సాదృశ్యముగా ఉన్నది. ప్రియస్నేహమా నీవు దేవుని మరియు సంఘమును జ్ఞాపకము చేసికొనుచున్నావా? సంఘకార్యక్రమములలో క్రమముగా పాల్గొనుచున్నావా? లేక కాకివలె తిరుగుచున్నావా?

2. సాధారణముగా ప్రతి పక్షిలోను "చేదుకట్టు" అనే సంచి ఉండును. ~~ఈ~~ చేదుకట్టు తీయకుండా కూర వండిన యెడల ఆ కూర అంతయు చేదుగా మారిపోవును. ఆ చేదు సంచి/కట్టు పావురములో ఉండదు. పావురమువలె మన జీవితములో

సమస్తమైన ద్వేషము కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వమును (చేదుకట్టును) విసర్జించుడి (ఎఫె. 4:31, హెబ్రీ 12:15-16). మనము పావురమువలె నిష్కపటముగా ఉండవలెనని దేవుడు కోరుచున్నాడు.

3. పావురము శరీరములో నుండి నూనె ఉత్పత్తియై ఎప్పటికప్పుడు దాని శరీరమును నునుపుగా చేయును. ఈ నూనె ద్వారా పావురము తన శరీరమును శుభ్రముగా ఉంచుకొనును. మనము కూడా పావురమువలె నిష్కపటులమై వాక్యమనే నూనె ద్వారా మన దోషములను, అపరాధములను ఎప్పటికప్పుడు ఒప్పుకొని వాటిని విడిచిపెట్టి మన హృదయమును శుద్ధిగా ఉంచుకొనవలెను (కీ. 119:9,11).

4. **<u>పావురము నమ్మకమైనది, కృతజ్ఞత కలిగినది</u>:** పూర్వకాలములో రాజులు పావురముల ద్వారా సందేశములను ఇతర రాజులకు పంపించెడివారు. ఆ పావురములు వెళ్ళమన్న రాజ్యములకు వెళ్ళి మరల తిరిగి వారిని పంపించిన రాజుయొద్దకు నమ్మకముగా కృతజ్ఞత కలిగివచ్చేవి. ప్రేమ సందేశములను పంపించుటకు పావురములను ప్రేమికులు ఉపయోగించుకొనెడివారు. దేవుడు తన ప్రేమసువార్తను సర్వలోకమునకు చాటించుటకు పావురమువలె నమ్మకమైనవారిని వెదకుచున్నాడు. దేవుని ప్రేమ సందేశాన్ని ఇతరులకు చేరవేయుటకు మీరు సిద్ధపడియున్నారా ప్రియస్నేహితులారా! (2 తిమో. 4:2-5) పావురమువలె సిద్ధపడండి.

5. **<u>పావురము తన నివాసమును బండసందులలో ఏర్పరచుకొనును</u>**

పావురము, గ్రద్ద, పక్షిరాజు, రాబందువలె క్రూరమైన పక్షి కాదు బలహీనమైనది, అది బండ సందులలో నివసించి సురక్షితముగా ఉండును. "బండసందులలో ఎగురు నా పావురమా, పేటుబీటల నాశ్రయించు నా పావురమా .... (పరమ. 2:14).

ప్రియ పాఠకులారా మనము పావురమువలె మన బండయైన క్రీస్తును ఆశ్రయించి క్రీస్తు అను బండపైన నిర్మించబడిన సంఘములో, సహవాసములో ఉండి మన జీవితాలు కొనసాగించుకొందాము. పావురమువలె దేవుడు అంగీకరించినట్లు సువార్తను విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది సురక్షితముగా క్షేమముగా జీవించెదము. ఆయన రాకడ కొరకు కనిపెట్టెదము మరియు నిత్యజీవమును పొందెదము (1 కొరి. 3:11, 10:4, 2 పేతు. 3:10-13).

# ఓ జీవన నేస్తమా జాగ్రత్త!-127

కె. సంధ్యారాణి, B.A.
పి.టి.స్కూల్

కృపావాక్యము చదువరులకు నా హృదయపూర్వక వందనములు. నిత్యజీవము అనే అంశమును గూర్చి ఈ నెల సంచికలో మనం మాట్లాడుకుందాము.

> కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము; అంత్యదినమున నేను వానిని లేపుదును (యోహాను 6:40).

ప్రియులారా నిత్యజీవము అనగా మనందరికి బాగా తెలుసు అది పరలోకము. ఈ భూమిమీద ప్రతి క్రైస్తవుడు ఆశపడేది దానికొరకే. అయితే ప్రభువునందు విశ్వాసముంచిన ప్రతి ఒక్కరు నిత్యజీవము పొందాలన్నదే ఆ యెహోవా తండ్రియొక్క చిత్తమని యోహానుగారు వ్రాసారు.

అయితే ప్రియులారా ఇక్కడే అసలైన లిటికేషన్ వుంది. మనందరికి పరలోకము వెళ్లాలనే ఆశే కానీ దానికొరకు మనము ఏమి చేయము. మనము ప్రభువుమీద కూడా పూర్తిగా విశ్వాసముంచము. నీతి క్రియలు చేయము, మరి ఎలాగున నిత్యజీవమును పొందుకుంటాము?

> తన ప్రాణమును ప్రేమించువాడు దానిని పోగొట్టుకొనును; ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్యజీవముకొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను ( యోహాను 12:25).

ఏమిటి యోహానుగారి యొక్క ఉద్దేశ్యమనగా ఒక వ్యక్తి ఈ లోకసంబంధముగా తన సుఖము, ధనము, వస్త్రము, ఆహారము, సౌకర్యాలు వీటికొరకే బ్రతుకుతాడు అలాగున కాదుకానీ క్రీస్తు కొరకు శ్రమలు పడవలసివచ్చినప్పుడు ఒకవేళ ధనమును విడిచిపెట్టవలసినప్పుడు వీటన్నిటిని కూడా ప్రభువు కొరకు వదులుకోవుటకు సిద్ధముగా వుండాలి. అప్పుడు క్రీస్తు నిమిత్తము వీటన్నిటిని ఎప్పుడైతే ద్వేషిస్తాడో అప్పుడు నిత్యజీవమును పొందుకుంటాడు.

> ఆయన బయలుదేరి మార్గమున పోవుచుండగా ఒకడు పరుగెత్తికొనివచ్చి ఆయనయెదుట మోకాళ్లూని - సద్బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు

నేనేమి చేయుదునని ఆయన నడిగెను. యేసు - నన్ను సత్పురుషుడని యేల చెప్పుచున్నావు? దేవుడొక్కడే గాని మరి ఎవడును సత్పురుషుడు కాడు. నరహత్య చేయవద్దు, వ్యభిచరింపవద్దు, దొంగిలవద్దు, అబద్ధసాక్ష్యము పలుకవద్దు, మోసపుచ్చవద్దు, నీ తలిదండ్రులను సన్మానింపుము అను ఆజ్ఞలు నీకు తెలియును గదా అని అతనితో చెప్పెను. అందుకతడు - బోధకుడా, బాల్యమునుండి ఇవన్నియు అనుసరించుచునే యుంటినని చెప్పెను. యేసు అతని చూచి అతని ప్రేమించి- నీకు ఒకటి కొదువగానున్నది; నీవు వెళ్లి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము, పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని చెప్పెను. అతడు మిగుల ఆస్తిగలవాడు, గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని, దుఃఖపడుచు వెళ్లిపోయెను. అప్పుడు యేసు చుట్టు చూచి - ఆస్తిగలవారు దేవుని రాజ్యములో ప్రవేశించుట ఎంతో దుర్లభమని తన శిష్యులతో చెప్పెను (మార్కు 10:17-23).

ప్రియులారా ఇచ్చట ఈ యౌవ్వనస్థున్ని మనం గమనించినప్పుడు ఇతడు బాల్యమునుండి కూడా అన్ని మంచి పనులే చేస్తున్నాడు. అబద్ధమాడక, తల్లిదండ్రులను గౌరవిస్తూ అంటే దేవుడిచ్చిన పది ఆజ్ఞలను కూడా ఇతడు పాటిస్తున్నాడు కానీ ఆస్తిని మట్టుకు దేవుని కొరకు నిత్యజీవము కొరకు వదులుకోలేకపోయాడు. ఇతను ప్రభువు దగ్గరకు రావటమే నిత్యజీవము పొందుటకు నేనేమి చేయాలని ఎంతో ఆసక్తితో అడుగుటకు వచ్చాడు కానీ చివరకు ప్రభువు చెప్పిన మాట అతనికి నచ్చక తన ఆస్తిని పోగొట్టుకొనుటకు ఇష్టపడక ముఖము చిన్నబుచ్చుకొని, దుఃఖపడుచు వెళ్లిపోయెనట.

ప్రియులారా మనము కూడా ఈ స్థితిలోనే వున్నామేమో ఆలోచన చేయాలి. మన దగ్గర కేవలం ధనము మాత్రమే కాదు కానీ దేవునికి ఉపయోగపడేది అనగా దేవుని సేవకు ఉపయోగకరమైనది ఏదైనా మనయొద్ద వుంటే దానిని దేవునికొరకు వదులుకోగలుగుచున్నామా? ఒక్కసారి ఆలోచన చేయాలి.

నిత్యజీవము పొందుకోవటమంటే అంత సులువేమి కాదు దేవునికొరకు మనము ఈ లోకసంబంధమైనవాటన్నిటిని వదులుకుంటే కానీ అది మనకు దక్కదని మనం దరము గుర్తెరిగి ఈ భూమిమీద మన బ్రతుకుకాలం బహు తక్కువని గుర్తెరిగి ఆ నిత్యజీవము పొందుటకు మనందరము ప్రయాసపడాలని కోరుతూ ముగిస్తున్నాను.

# సులువుగా చిక్కులు పెట్టు పాపము

మూలవాక్యము:

ఇంతగొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నందున మనము కూడ ప్రతిభారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందముకొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనముయొక్క కుడిపార్శ్వమున ఆసీనుడై యున్నాడు (హెబ్రీ 12:1,2).

ముఖ్యఉద్దేశ్యము:

పాపము మనలను ఎంతో సులువుగా మనకు తెలియకుండానే మనపై ఎంత ప్రభావమును చూపునో దేవుని వాక్యము ద్వారా తెలుసుకొనుట అవసరము.

ఉపోద్ఘాతము:

1) నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును. కీ. 66:18.

ఎ) లక్ష్యము అనగా ఇష్టపడుట, లేక పాపమని తెలిసి కూడా దానివలన కలుగు క్షణికమైన తృప్తికి బానిసలుగా మారుట.

బి) హృదయము అనగా judgement seat న్యాయస్థానము.

2) దేవుడు నా ఆరాధన గాని, నా ప్రార్థన గాని, నా కృతజ్ఞతను గాని, తనతో సహవాసము గాని ఎప్పుడు అంగీకరించును?

ఎ) ఎవరైతే తన్ను తాను తగ్గించుకొని తన దేవునికి తనకు కలిగిన వాటిలో నుండి శ్రేష్టమైన వాటిని హృదయపూర్వకముగా అర్పించుటవలన. హేబేలు

బి) తన పాపములను ఒప్పుకొని విడచుటవలన వానియొక్క అర్పణ అంగీకరించును.

చర్చనీయాంశము:

I. నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును. కీ. 66:18

1) పాపమును ఒప్పుకొని విడచినవాడు వర్ధిల్లును. సామె. 28:13
2) పాపములు ఒప్పుకొనుటచే అవి క్షమించబడును. కీ. 32:5,6
3) ఆయన క్షమించును. 1 యోహా. 1:8-10
4) ఎందుకనగా పాపుల ప్రార్ధన దేవుడు వినడు. యోహా. 9:31
5) పాపములు ఒప్పుకొనకపోవుటచే దేవుడు ఏమి చేయును?
   ఎ) ఆయన కన్నులు మూసుకొనును. యెష. 1:15
   బి) కీడు చేయక నుండుడి. యెష. 1:15,16
   సి) దేవుడు వారికి వ్యతిరేకియగును. సామె. 1:28,29, మీకా 3:4
   డి) ప్రార్ధించుటకు పవిత్రమైన చేతులు కావలెను. 1 తిమో. 2:8
6) మంచి క్రియలు చేయుచూ మేలు చేయుడి. యెష. 1:16-17
7) దేవుడు మనుష్యులకు ఉత్తమమైనది నేర్పియున్నాడు. మీకా 6:8

II. దురాభిమానపాపము. కీ. 19:13

1) అనగా sin of intentional, willful దావీదు బెత్సబాతో చేసిన పాపము బిలాము, అననీయ సప్పీరా. దురాభిమానపాపమును తెలుగులో నర్మగర్భముగా, ధైర్యముగా, గర్వంగా, ఖచ్చితముగా చేసిన పాపము.
2) నీ ముఖకాంతిలో మా రహస్య పాపము కనబడుచున్నవి. కీ. 90:8
3) తీర్పునకు మన పాపములు తేటగా నున్నవి. 1 తిమో. 5:24,25
4) బాల్యమునుండి పాపులమే. కీ. 25:7
5) బుద్ధిపూర్వకమైన పాపమునకు క్షమాపణము లేదు. హెబ్రీ 10:26, 2 పేతు. 2:20-21

**ముగింపు:**

1) మన హృదయము నిందారహితముగా నుండుట అవసరము. మత్త.5:8
2) పాపమును గూర్చి జ్ఞానము కలిగినచో దానినుండి దూరము పోవలెను యోసేపువలె.
3) పాపము చేయువారు నిత్యత్వము పొందలేరు.
4) మన శరీరము, ఆత్మ, మనస్సు నిందారహితముగా నుండవలెను.
5) క్రైస్తవునియందు దేవుని ఆత్మ నివసించును కాబట్టి పాపము లేని మన దేహములతో ఆరాధించువారము కావలెను.

చెప్పండి ప్రోత్సహించండి పంపించండి

# ఉచిత బైబిల్ ట్రైనింగ్

# అడ్మిషన్స్ జరుగుచున్నవి

→ 1 సం॥ (D.Th.) లేదా 2 సం॥ (B.Th.) తెలుగు మీడియం బైబిల్ ట్రైనింగ్ కొరకు

విద్యార్హతలు : పదవ తరగతి ఫెయిల్ లేక ఆ పైన

→ 1 సం॥ (D.Th.) లేదా 3 సం॥ (B.B.S. or B.D.) ఇంగ్లీషు మీడియం బైబిల్ ట్రైనింగ్ కొరకు

విద్యార్హతలు : ఇంటర్ ఫెయిల్ లేక ఆ పైన

**(గ్రీకు, ఇంగ్లీషు నేర్పుట మా ప్రత్యేకము)**

**చేతివృత్తులు** : 1) టైపు 2) టైలరింగ్ 3) కంప్యూటర్ 4) టి.వి. & సెల్‌ఫోన్ నేర్పబడును.

→ **నెలకు 5 రోజుల బైబిల్ ట్రైనింగ్ (పురుషులకు మాత్రమే)**

వయస్సుతో సంబంధం లేదు, సంఘబేధం లేదు, అన్ని మతశాఖలవారికి మా ఆహ్వానం

పెండ్లి అయినవారు, సంఘకాపరులు లేక సువార్తికులకు మాత్రమే

విద్యార్హతలు : పదవ తరగతి లేక ఆ పైన

**ఒరిజనల్ టి.సి. లేదా మార్క్‌లిస్ట్‌గాని తప్పనిసరిగా తీసుకొనిరావలెను**

## అందరికి నెలసరి స్టైఫండ్ రూ.500

**అందరికి ఉచిత భోజనము, వసతి ఏర్పాటుచేయుబడును**

కృష్ణ ఫలితము


ఆసక్తి గలవారు ఈ క్రింది చిరునామాను సంప్రదించండి

డైరెక్టర్, పి.టి.స్కూలు, తూరంగి, కాకినాడ-16

ఫోన్: 0884-2342125, సెల్: 9849031095

email: **kedarisetti_2000@yahoo.com**

website: www.preacherstrainingschool.com